బాబుకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామీ

వలు ఆలయాల్లో వైఎస్సార్ సీపీ నేతల పూజలు

పిడుగురాళ్ల: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్ సీపీ గురజాల నియోజకవర్గ నాయకుడు, పల్నాడు హాస్పటల్ అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపు ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పిలుపు మేరకు పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులకు స్వామివారి లడ్డూలో యానిమల్ ఫ్యాట్ కలిసినట్లు అసత్య ప్రచారాలు నిర్వహించిన చంద్రబాబునాయుడికి మంచి బుద్ధిని దేవుడు ప్రసాదించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు దాటినప్పటికీ సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటీ అమలు చేయకపోవడంపై ప్రతిపక్షం, ప్రజలు నిలదీస్తారనే భయంతోనే తిరుమల వేంకటేశ్వరస్వామి ప్రసాదమైన లడ్డూపైన తప్పుడు ప్రచారాలు నిర్వహించి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. పార్టీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు మాట్లాడుతూ... మాయమాటలు చెప్పటం, ప్రజలను మోసం చేయటం చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్యని, ఆ విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ కొక్కెర శ్రీను, మట్టారెడ్డి, పతంగి అమర్, పుణ్యాల చంద్రారెడ్డి, చిట్టిబోయిన నరసింహారావుయాదవ్, అరుణ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు

అసత్యాన్ని నమ్మించడమే చంద్రబాబు నైజం

మాచవరం: అసత్యాలను సత్యమని నమ్మించడమే సీఎం చంద్రబాబు నైజమని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. తిరుపతి ప్రసాదం లడ్డులో కల్తీ జరిగిదంటూ సీఎం చంద్రబాబు చేస్తున్న అసత్య ప్రచారంపై పాప ప్రక్షాళణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మండలంలోని మోర్జంపాడు గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైఎస్సార్ సీపీ నాయకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు టీడీపీ దుష్ప్రచారాలను చేస్తుందని విమర్శించారు. సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని స్వామివారిని వేడుకున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జిలుగు వెంకట నరసింహారెడ్డి, గ్రామ సర్పంచ్ భువనగిరి కృష్ణవేణి నరసింహారావు, లక్ష్మీబాయి వెంకయ్య నాయక్, నాయకులు బాదం వెంకట ప్రసాదరెడ్డి, ఎం.గురవారెడ్డి, ఎం.రాఘవరెడ్డి, మేడగం సుబ్బారెడ్డి, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మోర్జంపాడులో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రామాలయంలో పూజలు

దాచేపల్లి: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూపై కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు చేస్తున్న అసత్యాలపై వైఎస్సార్ సీపీ నాయకులు స్థానిక రామాలయంలో శనివారం పూజలు నిర్వహించారు. రామాలయంలో సీతారాములవారిని నాయకులు, కార్యకర్తలు దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు చేసి చంద్రబాబుకి మంచి బుద్ధిని ప్రసాదించాలని వేడుకున్నారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, ఎంపీపీ కందుల జాను, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, కౌన్సిలర్లు నాగుబండి గురువులు, వందనపు వెంకట్రామయ్య, చాట్ల క్రాంతి కుమార్, నాయకులు ముత్యం చెన్నారెడ్డి, కుందురు తిరుపతిరెడ్డి, దుర్గారావు, నాళం శ్రీనివాసరావు, బొడ్డు నాగేశ్వరరావు, మేడి సుగుణరావు, గరిణే పుల్లారావు, జక్కా అశోక్, కొర్రపాటి ఏర్రయ్య, జంగాల సింగరయ్య, నరసింహారెడ్డి పాల్గొన్నారు.



దాచేపల్లిలోని రామాలయంలో పూజలు నిర్వహించి, అనంతరం చంద్రబాబు అసత్య ఆరోపణలు ఖండిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దేవుడి ప్రసాదంతో రాజకీయాలు తగదు

గురజాల: దేవుడి ప్రసాదంతో రాజకీయాలు చేయడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు అలవాటేనని మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు శనివారం శ్రీ పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ గాంధీ, నగర పంచాయతి వైస్ చైర్మన్ షేక్ బడేజానీలు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ప్రసాదంలో అంతా కల్తీ జరిగిందని చెప్పడం దారుణమన్నారు. ప్రసాదంలో కల్తీ జరిగిందని చెబుతున్న వారందరికి మంచి బుద్ధిని ప్రసాదించాలని పూజలు నిర్వహించారు. పోలు వీరారెడ్డి, కొమ్మినేని బుజ్జి, చల్లా కాశీబాబు, దేవండ్ల నీలంరాజు, మహంకాళీ యశోద దుర్గా, గోళ్ల సైదయ్య, జక్కా సత్యం, డిజే నారాయణ, కనకం ఆదినారాయణ దత్తు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గురజాలలో పూజలు నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులు

రాష్ట్రంలో రాక్షస పాలన..

మాచర్ల రూరల్: రాష్ట్రంలో ఎన్నడూ చూడని రాక్షసరాజ్యం రాజ్యమేలుతోంది. దేవుడి దగ్గరకు వెళ్లే కార్యక్రమాలను అడ్డుకునే మనస్తత్వం ఉన్న ప్రభుత్వం ఉండటం రాష్ట్ర ప్రజల దురదృష్టమని మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, పోతురెడ్డి కోటిరెడ్డిలు అన్నారు. శనివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. తిరుమల పవిత్రత, స్వామివారి ప్రసాదం, విశిష్టతను తిరుమల తిరుపతి దేవస్థానం పేరు ప్రఖ్యాతలను రాజకీయ దుర్బుద్ధితో చెడగొట్టడం బాధాకరమన్నారు. స్వామిని అడ్డు పెట్టుకొని రాజకీయాలు చేయాలని చూసేవారికి భవిష్యత్‌లో పుట్టగతులుండవని హెచ్చరించారు. చంద్రబాబు చేసిన ఘోర పాపానికి శిక్ష ప్రజలకు కలగకూడదని కోరుకుంటూ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అరికట్ల పున్నారెడ్డి, అప్పిరెడ్డి అంజిరెడ్డి, రవికుమార్, ఎంపీటీసీ తేళ్ళూరి శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచ్ దళబంధపు కొండలు, గోగిరెడ్డి హనిమిరెడ్డి, ఓరుగంటి ప్రతాపరెడ్డి, గుండెబోయిన పున్నయ్య, ఓరుగంటి జయభారత్‌రెడ్డి, బాలిరెడ్డి, రమావత్ శ్రీను నాయక్, గోవిందు నాయక్ తదితరులున్నారు.

క్లుప్తంగా

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ వెనుక ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈసందర్భంగా ఉదయం నుంచి వందలా మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. పట్టణానికి చెందిన నట్టువ రాధా, రమణారెడ్డిలు లడ్డూలను ప్రసాదంగా భక్తులకు అందజేశారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

మాచర్ల: మాచర్ల సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, రెంటచింతల, గురజాల మండలాల రైతులకు సంబంధించి ఈనెల 30వ తేదీలోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని, ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ సహాయ సంచాలకులు వి.జగదీష్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ 2024 ఖరీఫ్ సీజన్‌లో పంట వేసిన రైతులు ఈనెల 30వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే పంటల బీమా, మద్దతు ధరకు అమ్ముకునే అవకాశం కోల్పోతారన్నారు. గ్రామ రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మాచర్ల: పట్టణంలోని రైలు గేటు పక్కన ఉన్న జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలను శనివారం మున్సిపల్ చైర్మన్ పి.నరసింహారావు సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశీలించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం భోజనం సమయం వరకు పాఠశాలలో ఉండి విద్యార్థులతో ముచ్చటించారు. సౌకర్యాలు, బోధన ఎలా ఉంది, భోజనం బాగుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను సందర్శించారు. హెచ్‌ఎం షేక్ షకీన, ఉపాధ్యాయులు, వార్డు కౌన్సిలర్లు ఉన్నారు.

అన్ని విద్యాసంస్థలు దసరా సెలవులు ఇవ్వాలి

– ఎంఈఓ ఎ.సురేష్



మాచర్ల: మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యం ప్రభుత్వం ప్రకటించిన విధంగా అక్టోబరు 3 నుంచి 14వ తేదీ వరకు దసరా సెలవులు తప్పనిసరిగా ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారి ఎ.సురేష్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సెలవు దినాల్లో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు తీసుకోవడంతోపాటు, పాఠశాలలను సీజ్ చేయడం జరుగుతోందన్నారు. ప్రైవేటు తరగతులు తదితరాలంటూ ఎలాంటి పరిస్థితుల్లోనూ సెలవు రోజుల్లో పాఠశాలలు నిర్వహించరాదన్నారు. విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పాఠశాలల ఉపాధ్యాయులు సమష్టిగా వ్యవహరించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

100 మందికి కళ్లజోళ్లు పంపిణీ



పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ, పెదకాకానికి చెందిన శంకర్ కంటి వైద్యశాల సంయుక్తంగా నిర్వహించిన కంటి పరీక్షల సుమారు 100 మందికి కళ్ల జోళ్ల పంపిణీ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు, సెక్రటరీ నీరుమళ్ల రాజేష్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలపైనా దృష్టిపెట్టాలి

మాచర్ల రూరల్: క్రీడలు మానసిక ధృడత్వంతో పాటు విద్యార్థుల్లో స్నేహపూరిత వాతావరణానికి దోహదపడుతుందని ఎంపీడీఓ కె.సరోజనీదేవి తెలిపారు. శనివారం మండల పరిధిలోని కంభంపాడు జెడ్పీహెచ్ స్కూల్‌లో క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. హెచ్‌ఎం రామిరెడ్డి విజయకుమారి అధ్యక్షతన జరిగిన ఎంఈఓ అల్లి సురేష్, పీఈటీ గారపాటి కర్తయ్య, ఏపీఓ కొరటా మల్లికార్జున్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకు కృషి

పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు

పిడుగురాళ్ల: నిరుద్యోగ యువతకు ఉద్యోగమేళా నిర్వహించి ఉద్యోగాలు కల్పించటమే నైపుణ్యాభివృద్ధి సంస్థ లక్ష్యమని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇ.తమ్మాజీరావు మాట్లాడుతూ గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా నిర్వహించటం జరిగిందన్నారు. ఈ జాబ్‌మేళాకు నాలుగు కంపెనీలు హాజరు కాగా 102 మంది హాజరయ్యారు. అందులో 34 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బీవీ కృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ నిర్వహించిన ఈ జాబ్‌మేళా పిడుగురాళ్లలో నిర్వహించటం చాల సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగాలు పొందినవారికి ఇక్కడే అవకాశాలు కల్పించటం యువతకు ప్రోత్సాహం కల్పించినట్లు అవుతుందన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ఎం.రవీంద్రనాయక్, పిడుగురాళ్ల స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ పి.శ్రీకాంత్, సురేష్, మస్తాన్, కంపెనీ హెచ్‌ఆర్‌లు, ప్రతినిధులు, కాలేజీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో అధికారులు

హోరాహోరీగా ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు



జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో కో-ఆర్డినేటర్ నర్సిరెడ్డి, పీఈటీలు



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

పిడుగురాళ్లరూరల్: హోరాహోరీగా బాలురు, బాలికల స్కూల్ గేమ్స్ జరిగాయి. మండలంలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం అండర్-14, అండర్-17 బాలురు, బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ గురజాల నియోజకవర్గ కో-ఆర్డినేటర్ నందిపాటి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి, మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు విద్యార్థులను ఎంపిక చేయటం జరిగిందని, త్వరలోనే వీరందరూ జిల్లా పోటీలలో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపిక అవుతారని ఆయన తెలిపారు. ఎస్‌జీఎఫ్ కో-ఆర్డినేటర్ నందిపాటి నర్సిరెడ్డి, ఎస్‌జీఎఫ్ కన్వీనర్లు కె.డానియేలు, పి.వెంకటారవు, డి.అమల, న్యాయ నిర్ణేతలు కె.మోమన్‌కుమారి, సౌజన్య, శివరామకృష్ణ, కె.నాగభూషణం, ఎస్.సురేంద్రం, సీహెచ్ కిష్‌కుమార్, ఎ.రత్నరాజు, కె.జ్ఞానరత్నం, ఎం.రవి, కొండలరావు, నాగేశ్వరరావు, శిరీష, ఎన్.సుస్మిత, బబిత, విజయరాణి, సాయిబాబు, వి.రామరావు, నాగేంద్రబాబు, వై. వెంకటేష్, దుర్గ, శ్రీకాంత్, జి.నాగరాజులు ఎంపికయ్యారు.

గుండెవ్యాధుల మెగా వైద్యశిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని డాక్టర్ అంజిరెడ్డి హాస్పటల్‌లో శనివారం గుండె వ్యాధులపై మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన రోగులకు ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంజిరెడ్డి హాస్పటల్ అధినేత డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కార్డియాలజిస్ట్ డాక్టర్ కోటా శబరి గిరిష్‌లు గుండె వ్యాధుల రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గుండె వ్యాధులు రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లను కూడా వివరించారు. అనంతరం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 150 మంది గుండె వ్యాధి రోగులను పరీక్షించి వారికి ఉచితంగా ఓపీ, ఈసీ, టీడీ, ఎకో వంటివి నిర్వహించారు. అవసరమైన రోగులకు ఎన్‌టీఆర్ వైద్య సేవ ద్వారా ఎన్‌జీయోగ్రాం టెస్ట్ కూడా ఉచితంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

దాచేపల్లి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు బొల్లంపల్లి ఏసురత్నం, చింతకింది వెంకట కోటేశ్వరరావులను శనివారం ఘనంగా సన్మానించారు. నారాయణపురంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఏసురత్నం, వెంకట కోటేశ్వరరావులను శాలువా, పూలదండలతో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఉపాధ్యాయులు చెట్టిపాగు ఏసురత్నం, మందా రాజశేఖర్, రాములు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ఏసురత్నం, కోటేశ్వరరావులను సత్కరిస్తున్న దృశ్యం

మెప్మా ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్



మాచర్ల: పట్టణంలోని ఇదిమంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మెప్మా, అంగన్‌వాడీల ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌లో అంగన్‌వాడీలు, చేతివృత్తిదారులు, వంటకాలు ప్రదర్శించి అమ్మకాలు కొనసాగించారు. కార్యక్రమాలను అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారి సరళ, సూపర్‌వైజర్ దుర్గాదేవి, మెప్మా ప్రాజెక్టు అధికారి ఎం.సుబ్బారావు, డీఓలు, రాజశేఖర్, అంజలి, తదితరులు ఉన్నారు.

దాచేపల్లి: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో స్థానిక లైబ్రరీ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్ ఏర్పాటు ఆయన ప్రారంభించారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన వస్తువులు, తినుబండరాలు ప్రదర్శించారు. స్థానికులు ఈ మార్కెట్‌ని సందర్శించి పలు వస్తువులను కొనుగోలు చేశారు. నగర పంచాయతీ కమిషనర్ ఎంవీ అప్పారావు, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఏపీపీగా ఎన్.నాగమణి బాధ్యతల స్వీకారం



గురజాల: అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏపీపీగా నేలపాటి నాగమణి నియామకం జరిగింది. శనివారం కోర్టులో జరిగిన కార్యక్రమంలో ఏపీపీగా నాగమణి బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నుంచి సాధారణ బదిలీపై గురజాల కోర్టుకు వచ్చారు.

భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తిదాయకం



పిడుగురాళ్ల: స్ఫూర్తిదాయకం భగత్ సింగ్ జీవితమని పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు అన్నారు. పట్టణంలోని కామ్రేడ్ సీతరాం ఏచూరి ప్రాంగణంలో పల్నాడు డిస్టెంట్ సహకారంతో ఎస్ఎఫ్ఐ రక్తదాన శిబిరం నిర్వహించింది. ఈసందర్భంగా సీఐ వెంకట్రావు మాట్లాడుతూ భరతమాత దాస్యశృంఖలాలను తెంచేందుకు తన ప్రాణాలనే ఫణంగా పెట్టిన భగత్‌సింగ్ యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కోటా సాయికుమార్ మాట్లాడుతూ భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకొని రక్తదానం శిబిరం నిర్వహించామని, శిబిరంలో సుమారు 60 మంది వరకు రక్తదానం చేశారని ఆయన తెలిపారు. పీఎస్ఆర్ డిగ్రీ కాలేజీ డైరెక్టర్ కోనేటి నరసింహారావు, బడిసా మస్తాన్‌రావు, పల్నాడు డిస్టెన్స్ అకాడమీ డైరెక్టర్ శైలజ, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు రోహిత్, రామకృష్ణ, యూసిన్, పల్నాడు డిస్టెన్స్ అకాడమీ సభ్యులు సాగర్, పీఎస్ఆర్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా చెస్ పోటీలకు మిరియాల విద్యార్థినులు

కారెంపూడి: మండలంలోని మిరియాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు అండర్ 14 విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం యాకసిరి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అభినందన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పీఈటీ అంజమ్మను, విద్యార్థినులను ఎస్ఎంసీ చైర్మన్ తిప్పాబత్తుల శ్రీనివాసరావు, సభ్యులు, తదితరులు అభినందించారు.

సెయింటాన్స్ విద్యార్థుల ప్రతిభ

పిడుగురాళ్ల: పట్టణంలోని సెయింటాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో జిల్లా వాలిబాల్‌కు ఎంపికయ్యారని పీఈటీ పోతురాజు తెలిపారు. అండర్ 17 బాలికల విభాగంలో 9వ తరగతి చదవే ప్రవళిక ఎంపిక అయిందని, అదేవిధంగా అండర్ 14 బాలుర విభాగంలో వి. కేశవ ఎంపికయ్యాడని తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించినట్లు తెలిపారు.



ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మాచర్ల-చెన్నై ప్రతిరోజూ ప్రత్యేక బస్సు సర్వీసు

మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య



మాచర్ల: పట్టణం నుంచి ప్రతిరోజూ చెన్నైకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు, ముందుగా బెంగళూరు వెళ్లే సర్వీసు కొనసాగుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య శనివారం తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంస్థ అభివృద్ధి పనుల గురించి వివరించారు. నూతనంగా చెన్నై వెళ్లేందుకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బస్సు మాచర్లలో సాయంత్రం 5 గంటలకు బయల్దేరి, కారంపూడి, వినుకొండ, పొదిలి, ఒంగోలు, నెల్లూరు మీదుగా చెన్నైలోని మాధవరన్ బస్టాండ్‌కు మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు చేరుకుంటుందన్నారు. ప్రతిరోజూ ఈబస్సు సర్వీసు ఉంటుందన్నారు. బెంగళూరుకు ప్రతిరోజు సాయంత్రం 5.30 గంటలకు మాచర్ల నుంచి బయల్దేరి రెండోరోజు ఉదయం 7.30 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈరెండు సర్వీసులతోపాటు, నూతనంగా ఎనిమిది సూపర్ డీలక్స్‌లు, మూడు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు మాచర్ల ఆర్టీసీ డిపోకు మంజూరు అయ్యాయన్నారు. బస్సు సర్వీసులన్నీ దూర ప్రాంతాలైన గుంటూరు, విజయవాడతోపాటు, పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత మూడు సంవత్సరాలుగా గుంటూరు ఆర్టీసీ రీజనల్ పరిధిలోని మొట్టమొదటిస్థానంలో మాచర్ల డిపో ఉందన్నారు. ఆదాయంలో మొదటిస్థానంలో ఉందన్నారు. స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా డిపో గ్యారేజ్‌లో పిచ్చి మొక్కలు తొలగించి, పరిసరాలు శుభ్రం చేసి, మొక్కలు నాటారు. గ్యారేజీ ఉద్యోగులు, యూనియన్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలి

కారెంపూడి: సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను అందరూ నిషేధించాలని ఈఓపీఆర్డీ పి.సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలలో భాగంగా శనివారం కారెంపూడిలో ఇన్‌చార్జి సర్పంచ్ బి.సరస్వతీభాయి అధ్యక్షతన జరిగిన గ్రామ సభ జరిగింది. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ గ్లాసులు, విస్తర్లు, టీ గ్లాసులు, టేబుల్ పేపర్ల తదితరాల వినియోగం తర్వాత వాటిని బయట పారేయడం వల్ల అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని రోడ్ల వెంట ఎక్కడ పట్టినా ఇవే కన్పిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పారిశుద్ధ్య సమస్యలతో పాటు అనారోగ్య సమస్యలు కూడా వస్తున్నాయని వీటి నిరోధానికి అందరూ సహకరించాలని కోరారు. అలాగే ఒప్పిచర్ల గ్రామంలో ఇన్‌ఛార్జి సర్పంచ్ పుష్పావతి అధ్యక్షతన, పెదకొదమగుండ్లలో ఇన్‌ఛార్జి సర్పంచ్ లక్ష్మయ్య అధ్యక్షతన గ్రామ సభలు జరిగాయి.